# ఖాళీ సంచులు

పుంత మొగలో ఆగింది బస్సు.

'గోయిందపురం- గోయిందపురం' అరిచేడు కండక్టరు.

సీట్లోంచి ఉలిక్కిపడి లేచింది దుర్గ.

కాళ్ళ దగ్గరున్న తన సంచులు రెండూ తీసుకుని బస్సు మెట్టుమీంచి ఒక్క దుముకు దుమికింది.

"హమ్మయ్య, పీడ విరగడైంది బాబూ" అంటోంది దుర్గ పక్కన కూచున్నావిడ, ముక్కు మీద కప్పుకున్న పైటచెంగుని పక్కకి వదిలేస్తూ. వెనక్కి తిరిగి సంచిలోంచి ఓ ఎండు చేపని తీసి ఆవిడ మీదకి విసురుదామా అనిపించింది దుర్గకి. తన ఆలోచనకి తనకే ఫక్కున నవ్వొచ్చింది.

'పాపం,బేపనోరు కావోల్సు' అనుకుని జాలిపడింది.

"రైట్ రైట్" అన్నాడు కండక్టరు.

పుంత దారివైపు రెండడుగులు ముందుకేసింది దుర్గ. అప్పుడు గుర్తుకొచ్చింది- కండక్టరు తనకి రూపాయివ్వాలని. సంచుల్ని కిందపెట్టి చటుక్కున బస్సు వేపు చూసింది. నల్లని తారురోడ్డు మీద స్పీడందుకుని అడవి లోపలి ఊళ్ల వైపు దూసుకుపోతోంది బస్సు. అది కనుమరుగయ్యేవరకూ నిలబడి జాకెట్లో పెట్టుకున్న డబ్బుల మడతలోంచి టిక్కెట్టు ముక్కని తీసి, దాని వెనక వేసున్న ఒకటి అంకెను చూస్తూ విచారంగా కింద పడేసింది.

సంచుల్ని కాళ్ళ దగ్గర పెట్టుకోనిచ్చినందుకు కండక్టరు మంచోడే అనుకుంది కానీ ఇప్పుడు రూపాయి నొక్కేసినందుకు ఒళ్లు మండుకొస్తావుంది.'ఈ కండట్టర్లెప్పుడూ ఇంతే, మనం ఒక పావలా తక్కువిచ్చినా ఒప్పుకోరు, ఆళ్లివ్వాల్సిన సిల్లర ఎంటనే ఇవ్వరు. ఇదిగిలాగే మరిసిపోతారు' అనుకుంది తనలో తను చిరాగ్గా. 'పొద్దున్నే ఎవరి మొకం సూసేనో, రూపాయి దండగ' -సంచుల్ని చేతుల్లోకి తీసుకుంది. '

అమ్మో, సేలా బరువున్నాయే, ఈట్నట్టుకుని నాలుగు మైళ్ల నడకంటే మాటలా' అనుకుంటూ వెనక్కి తిరిగి రోడ్డవతలి టీ పాక వేపు చూసింది ఊళ్లో కొచ్చేవాళ్లెవరైనా తారసపడతారేమోనని.

ఇటే చూస్తున్న టీ పాక భద్రం దుర్గని పోల్చుకుని- "ఓల్నువ్వంటే దురగా, ఇంకెవరో అని చూస్తన్నాను, ఇదేనా రాటం? ఇలాదా, టీ తాగి ఎల్దువుగాని" అని పిల్చేడు.

దుర్గ చొరవగా అటు నడిచి "బాగున్నావా మాయ్యా" అంది బల్ల మీద కూర్చుంటూ.

భద్రం మొహం చేటంత చేసుకుని, "నా బాగుకేంలే, ఏదో ఇలాగ నడిసిపోతంది బండి, నువ్వెలాగున్నావు? తెలుత్తానే ఉందిలే బస్తీ నీళ్లు బాగానే ఒంటబట్టేయని" అన్నాడు నఖశిఖ పర్యంతం దుర్గని చూస్తూ.

నల్లని దుర్గ ఒంటికి మంచి నిగారింపు వచ్చింది. చెవులకి చిన్న జూకాలెట్టుకుంది. ఎడమ ముక్కుకి ఒంటి రాయి బేసరి ఎండ పడి మెరుస్తా ఉంది. తెల్ల పువ్వులున్న మబ్బురంగు చీర కట్టుకుంది. నలుపు రంగు జాకెట్టు మీద- జానెడు చేమంతి పూలమాల చెవి పక్కనుంచి తొంగి చూస్తావుంది. చూపు తిప్పుకొని, అగ్గిపుల్ల గీసి స్టవ్వు అంటించేడు భద్రం. టీ గిన్నెని స్టవ్వు మీద వేడి చేసి సేవెండి కోపాలోకి వడకట్టేడు. ఎన్ని రోజుల నాటిదో టీపొడి, వడకట్టే గుడ్డలో పెద్దమూట లాగ ఉంది, దాన్లోంచి టీ కోపాలోకి జారుతుంటే చూస్తూ కూర్చుంది దుర్గ. రెండు గాజు గ్లాసుల్లోకి ఒంపి ఒకటి దుర్గకిచ్చి, తనొకటి తీసుకున్నాడు భద్రం.

డిసెంబరు నెల ఉదయం పది గంటల వేళైనా చెట్ల గుబుర్లలోంచి చలి ఇంకా కిందికి జారుతూనే ఉంది.

వేడివేడి పొగలుకక్కుతున్న గ్లాసందుకుని టీ చప్పరించింది దుర్గ.

కిరసనాయిలు వాసనా, నిలవ టీపొడి వాసనా కలిసి చాలీచాలని పంచదారతో ఏదో వెగటుగా ఉంది టీ. వద్దని వదిలేస్తే భద్రం ఏమనుకుంటాడో

అని తాగుతోంది దుర్గ.

బస్తీకెళ్లేక అక్కడ దొరికే నీళ్ల పాలల్లోనే ఇంత పంచదార, టీపొడి వేసుకుని అప్పటికప్పుడు మరగబెట్టుకుని తాగడం అలవాటైపోయింది.

"అంత బలువు మోసుకొత్తన్నావేటి, తమ్ముడికీ మరదలికీ ఏటేటి కొన్నావేటి?" అన్నాడు భద్రం.

దుర్గ నవ్వేసి, "మేవేం కొనగల్దుం బాబూ" అని వేళాకోళమాడింది.

"ఓసోసి, అందుకే గామోసు నిట్రాడి పాకని పెంకుటిల్లు గట్టించేవు. ఎకరం మెరక కొన్నావు. మీ కుటంబాన్ని ఎన్నేళ్లనించి ఎరిగున్నాను! ఏ మొగోడైనా ఈ మాత్రం సాధించేడేటి? ఇంక మీ బాబైతే. ఏనాడన్నా పెళ్లవని, పిల్లలని పట్టించుకున్నాడా? తాటిసెట్టెక్కి ఎక్కడ తీసిన కల్లు అక్కడే అమ్మేసుకుని కడుపు నిండా సారా తాగేసి ఏ సెట్టుకిందో పడుకునేసీవోడు. మొత్తానికలాగ తాగి తాగే కడుపులో పేగులన్నీ సారా తినేసి సచ్చిపోయేడు".

"ఆడిమాట ఉప్పుడెందుకులే మాయ్యా" అంది దుర్గ. తనకి పదేళ్ల వయసప్పుడు చచ్చిపోయిన తండ్రి కళ్లల్లో మెదిలేడు.

"అదికాదమ్మీ. ఏ మాటికామాటే సెప్పుకోవాలా ఒద్దా. తమ్ముణ్ని సదివించి అంతటోణ్ని చేసేవు, ఈ రోజుల్లో ఎవరికమ్మా అంత దందపడతాది? అవునింతకీ ఏం కొనుక్కొచ్చేవు తమ్ముడికోసం" అన్నాడు మళ్లీ.

"ఏదోలే, కొత్త బట్టలూ గట్టా కొనుక్కొచ్చేను. ఆల్లిద్దరూ ఉజ్జోగమంతులేనాయె. మనం కొంటే మాత్రం ఆళ్లకి నచ్చొద్దూ..." అంటూనే దుర్గ లేచి బకెట్టులో సగానికున్న మురికి నీళ్లల్లో గ్లాసు తొల్చి బల్ల మీద పెట్టింది. 'సంచిలోయన్నీ తీసి సూపించమని దిష్టెడతాడో ఏటో' అని సణుక్కుంది.

"అయినా గానీ పిల్లా దురగా, నువ్వు, తనకి మాలిన దరమం అంటారే అలాగ సేసుకున్నావు. పెళ్లీ పెటాకులూ అనకుండా నావోళ్లూ నా కుటంబం అన్నావు, నీ పిచ్చి గాని పెళ్లయ్యేక తమ్ముడు తన వోడవుతాడేటే? నీ కడుపునో కాయ కాసి.

దాన్ని ఆడికిచ్చి ముడెడితే ఆ సంగతి ఏరేగా ఉణ్ణు".

ఎక్కణ్ణుంచొచ్చిందో కుక్క ఒకటి దుర్గ బల్ల మీద పెట్టిన సంచులకి మూతెత్తి మూచూస్తూ బల్లచుట్టూ తిరగడం మొదలెట్టింది.

"ఛీ...ఛీ..." అని అదిలించింది దుర్గ.

"ఏటెండుసేపలు గానీ అట్టుకొచ్చేవేటి, కుక్క నోట్లో నీళ్ళుగారిపోతన్నాయ్" అన్నాడు భద్రం. సంచులున్న బల్లకేసి నడుస్తూ," ఇదన్న మాట సంగతి ఇందాకట్నుంచి ఏట్రా బాబూ వోసన, పాకెనకాల ఏ నక్కయినా సచ్చిందో ఏటో అనుకున్నాను" అన్నాడు.

ఆ మాటకి దుర్గ పకపకా నవ్వింది. "నేనింకా గుప్పిడు నెత్తళ్ళు, ఒక సందువా తట్టాం ఇద్దారనుకున్నానే, అంత వోసన బరించలేనోడివి నువ్వేం తింటావులే" అంది.

"తల్లి తల్లి దురగా, ఆ మాటనకొలే, ఇచ్చి పున్నెం కట్టుకోమ్మా! ఎండు సేపలు తినక నోరు సవి సచ్చిపోయిందనుకో. నెత్తళ్లలో పాలోసి మసాలా యెట్టి ఒండుకుంటే దాన్నుసి ఇంకదేనికొత్తాది?" అన్నాడు భద్రం నోట్లో ఊరుతున్న నీళ్లని గుటకేస్తూ.

"ఇత్తాన్లే ఇంటికాడ మాయత్తకి" అంది దుర్గ వెళ్లడానికి తయారవుతూ.

"ఇయ్యాళ ఊళ్లోకెళ్లీవోళ్లెవరూ అంపడ్డం లేదేటో"

"నేనొత్తన్నానుండు, ఇయ్యాళ బేరాల్లేవు ఏవీ లేవు దీన్తల్లిసిగదరగ"అన్నాడు భద్రం.

టీ గిన్నెలు స్టవ్వు పక్కనే ఉన్న పెద్ద చెక్కపెట్లో పెట్టి తాళం బిగించేడు. జేబులోంచి బీడీ తీసి నోట్లో పెట్టుకుని పాలు కాయడానికి వేసిన పిడకల దాలిలో నిప్పు కోసం చాలా సేపు కెలికేడు. పొద్దున్ననగా వేసిన దాలి, అదెప్పుడో చప్పగా చల్లారిపోయింది. నిక్కరు జేబులోంచి అగ్గి పెట్టె తీసి బీడీ వెలిగించుకుని గుండె నిండా ఒక దమ్ము లాగి ఖళ్లు ఖళ్లు మని దగ్గేడు.

"ఈ దగ్గొకటి పీంౘ్రించేస్తంది ఒదలకుండా" అన్నాడు స్వగతం లాగ.

"బలేవోడివే మాయ్యా, జేబులో అగ్గి పెట్టుంచుకునే నిప్పు కోసం అంతసేపు కెలికేవు?" అంది దుర్గ.

భద్రం గారపళ్లన్నీ కనిపించేలాగ నవ్వి "అదేనే మరి యాపార రాస్యం. మీ జీతగాళ్లలాగ కర్చు పెట్టెయ్యటానికి కుదర్దు మాకు" అన్నాడు.

"ఏటో, అగ్గిపుల్లలూ గట్టా పొదుపు చేసేసి ఇంటి మీద టాపు తీసి మేడ గట్టేసినట్టు. నా సిన్నతనం నుంచి చూస్తన్నాను వానొత్తే కారిపోయీ తాటాకు పెణకే గాని పెంకన్నా నేయించేవు కావు"

భద్రం ఓ క్షణం నిర్వేదంగా దుర్గ వేపు చూసి, తల విదిలించుకుని చూపుడు వేలు పైకెత్తి ఆకాశంలోకి చూపించేడు. "అంతా ఆ పైవోడి దయ. రోజంతా ఇక్కడ కూకుని ఈగల్తోలుకున్నా రెండు పొట్టలెల్లడం కష్టవై పోతంటే ఏటిసెయ్యగలం" అన్నాడు మూల నున్న డొక్కు సైకిలు స్టాండు తీస్తూ.

దుర్గ సంచులు అందుకుని వెనక చెక్క కేరేజిమీదొకటి, ముందు హేండిలు బారు మీదొకటీ పెట్టి నడిపించుకుంటూ పుంత వేపు దారి తీసేడు. వెనకే దుర్గ.

బస్సు దిగినప్పుడున్న హుషారు తగ్గినట్టనిపించింది దుర్గకి.

ఎండ నెత్తిని చుర్రుమనిపిస్తోంది. దారికటూ ఇటూ డొంకలు తప్ప నీడ నిచ్చే చెట్టొకటీ లేదు.

"పాపం భద్రం మాయ్యా, నా మూలాని నీకు నడక తప్పింది కాదు, లేపోతే సైకిలెక్కేసి నివషంలో ఎల్లిపోయీవోడివి" అంది.

"ఆ, దాన్దేవుందిలే, నాలుగడుగులు నడిత్తే మొక్క మొలిసి పోతానా ఏటి, ఆడపిల్లవి నువ్వింత బలువు సంచులుచ్చుకుని అంత దూరం నడగల్దూవేటి? అక్కడ రిచ్చాలో వొచ్చి బస్సెక్కుంటావ్" అన్నాడు– "అయినా మనకీ మనకీ సేవితం ఇయ్యాల్నాటిది కాదు. నువ్వింత పిల్లంత ఉన్న కాణ్నుంచీ మీ బాబుకీ నాకూ సేయితం.

సేసిన పాపం సెప్తే పోతాదంటారు. సెప్పాపోడవేం, ఆడూ నేనూ పందేలేస్కుని మరీ తాగివోళ్లుం. మంచి మణుసుకురిసీ తెల్లార గట్టేళ సెట్టెక్కి కల్లు ముంతలు దించీవోడు మీ బాబు. అయిసేసిన కూలుడ్రింకులాగ కడుపులోకి సల్లగా దిగిపోయిాది తల్లి మాలచ్చిమి. ఇంటికాడ మీయత్త ఓ... తెగ గోలెట్టేసీది-'నువ్వేవన్నా కాపోడివా కల్లు తీసీవోడివా' అని. అయినా సరే మా సేయితం ఇళ్లేదు. ఆకరుకి మీబాబెప్పుడైతే సడాలుమని సచ్చిపోయేడో అంతే, అల్లైత్తిపోయి తాగుడూ గీగుడూ బందు జేసేసేను"-అయిపోయిన బీడీ పీకని పెదవులు కాలేదాకా పీల్చి ఆగి, బొటనవేలుకి మధ్య వేలు ఆనించి ఆ గోటితో తుప్పలోకి కొట్టేడు.

ఈ లోపల దుర్గ కొంచెం ముందుకైంది.

"కుప్పుసామి బాగున్నాడా?"

హఠాత్తుగా వెనక నించి వచ్చిన ప్రశ్నకి బిత్తరపోయి రాయిలా నిలబడిపోయింది దుర్గ.

సైకిలు దుర్గ నిల్చున్న దగ్గరకొచ్చేక అనునయంగా దుర్గ ముఖంలోకి చూస్తూ "ఎర్రిపిల్లా, ఏటలాగైపోయేవు? ఉప్పూ కారం తినీ ఒళ్లు మొగోడికైనా ఆడదానికైనా ఒకటే కదా! మీయమ్మ నీకు వొయసొచ్చీతలికి పెళ్లి చేసి అత్తోరింటికి అంపిచ్చా పోబట్టే గదా నువ్వాపని సెయ్యవలిసొచ్చింది. మీయమ్మే వనుకున్నాదంటే దీనికి పెళ్లి జేసేత్తే నా దినం దీరీదెలాగ అనుకున్నాది. నువ్వు బళ్లో జేరిపించి నెలనెలా డబ్బులంపబట్టే కదా నీ తమ్ముడు సదువుకుని ఇంతటోడయ్యేడు! లేకపోతే కల్లమ్ముకుంటూ ఈ కొండలమ్మటుండ వలిసి నోడే కదా, మనసు నెమ్మళించుకో, ఏం బయ్యం లేదు" అన్నాడు.

దుర్గ నడక మందగించింది.

సంకురాత్రి ముందు ట్రాలరు మీద ఒరిస్సా సముద్రంలోకెళ్లిన కుప్పుసామి గుర్తుకొచ్చేడు.

కోరమీసం, కండలు తిరిగిన కారు నలుపు శరీరం తెల్లగా మెరిసే పలువరస,

ఉంగరాలు తిరిగిన దుబ్బుజుట్టు- అతని తలంపుతో ఒళ్లంతా ఒక పులకరింతలా జలదరించింది. గతంలోకి మనసు పరుగెత్తింది.

తనకప్పుడు పదేళ్లుంటాయేమో, అప్పట్లో ఈ పక్క ఊళ్లో వరసగా అయిదారేళ్లు వానలు పడక పొలం పనులు లేకపోయాయి. ఎక్కడ పని దొరుతుందంటే జనం అక్కడికి వలసపోయేరు. చాలామంది దగ్గర్లో ఉన్న జగ్గంపేట పెంకుల మిల్లుల్లో కూలీలుగా చేరిపోయేరు.

తండ్రి పోయేక ఇంటికి పెద్ద దిక్కుగాతనేనిలబడవలిసొచ్చింది.

తల్లి ఉత్తి అర్భకం మనిషి. ఒకరోజు పనికెళ్తే వారం రోజులు పడకేసేది. తమ్ముడు పసిపిల్లోడు, అయిదారు గర్భణీలు పోయేక పుట్టిన మొగనలుసని తల్లికి ఆడంటే ప్రేణం. తనకీ అంతే. నడకొచ్చిందగ్గర్నుంచి తన పరికిణీ కుచ్చిళ్లు పుచ్చుకుని 'అక్కా అక్కా' అంటూ వదలకుండా తిరిగేవోడు.

పెంకుల మిల్లుల్లోని మట్టి తట్టలు మోసే బరువు పని తన వల్లకాలేదు. అందుకే తెలిసిన చుట్టాలెవరి ద్వారానో తల్లి తనని కాకినాడ పంపించింది. అక్కడ రొయ్యలు వొలిచి నిలవ చేసే గొడవున్సులో పని.

చాన్నాళ్లు తనని తీసుకెళ్లిన చుట్టాలింట్లోనే ఉండి ఆళ్లకి నెలకింతని భోజనానికిచ్చి మిగతా డబ్బులు తల్లికి పంపేది.

సెలవు పెడితే ఆ జాగాలో ఇంకెవరైనా చేరిపోతారని తనసలు సెలవు పెట్టేదికాదు. అప్పుడప్పుడు తల్లే తమ్ముణ్ని తీసుకుని తనని చూడ్డానికొచ్చేది.

రొయ్యలపని లేనప్పుడు జెట్టీలో చేపలారబెట్టేపని ఉండేది. సముద్రంలో పట్టి తెచ్చి గుట్టలుగా పోసిన చేపల పొట్టల్ని చీల్చి శుభ్రంచేసి ఉప్పులో ఊరేసి ఆరబెట్టడం. మొదట్లో ఆ వాసన భరించడం కష్టమైపోయేది. క్రమంగా అలవాటైపోయింది.

అక్కడే తను పెరిగి పెద్దదైంది.

ఆ జెట్టీలోనే కుప్పుసామి పరిచయమయ్యేడు, తనకి ఇరవై ఏళ్ల వయసప్పుడు.

ఆ రోజు-

జెట్టీ అంచు దగ్గిర ఉయ్యాలలూగే పడవల వరస మీంచి అతను అలవోకగా నడుచుకుంటూ వస్తా ఉంటే అబ్బురమనిపించి చూస్తానుంచుంది. దగ్గరకొచ్చేక కన్నుకొట్టి

"ఏం పిల్లా, ఏటి సంగతి, కన్నార్పకుండా చూస్తన్నావు, నచ్చేనా?" అన్నాడు.

తను ఉడుక్కుని, "నిన్నేం కాదులే, పడవల్ని చూస్తన్నాను" అంది.

"అయితే పని మానేసి పడవల్ని సూస్తావన్నమాట, ఉండు మేనేజరుతో చెప్తాను" అంటూ నవ్వుతూ వెళ్లిపోయేడు.

తర్వాత ఎప్పుడు కనిపించినా దగ్గిరకొచ్చి పలకరించేవాడు. ఆ పలకరింపుల మామూలు స్నేహం ఎప్పుడు ఎలాగ తామిద్దరి మధ్యా శారీరక బంధమయ్యిందో అయ్యింది. అవసరం తమ ఇద్దర్నీ అలా దగ్గిర చేసిందని అర్థం చేసుకున్నారిద్దరూ.

అతని పెళ్లాం పిల్లలు మెడ్రాసు దగ్గిర ఏదో ఊళ్లో ఉంటారని ఏడాదికి రెండుసార్లు తనే యెళ్లొస్తాడనీ చెప్పేడు. తనలాగే అతనూ ఇంటికి డబ్బులు పంపేవోడు. కుప్పుసామికి జీతం కాకుండా కమీషనుగా బాగా డబ్బులొచ్చేవి. అలాంటప్పుడు తనని సినిమాలకీ షికార్లకీ తిప్పేవాడు. రంగు రంగు చీరలు కొనిచ్చేవాడు. ఇంటి అద్దె, తిండి ఖర్చు కలిసొస్తుందని త్వరలోనే తను అతనుండే గదిలోకి మారిపోయింది.

తల్లి మొదట్లో నెత్తీ నోరూ కొట్టుకుని ఏడ్చింది. తర్వాత తను ఎప్పటికన్నా ఎక్కువ డబ్బు పంపిస్తూండడంతో కిమ్మనకుండా ఊరుకుంది. కుప్పుసామి మంచి జల్సాలో ఉన్నప్పుడు వందలకి వందలు తనకిచ్చేవాడు. అలా దాచిన డబ్బుతోనే తల్లి ఊళ్లో పూరిపాక స్థానంలో పెంకుటిల్లు కట్టించింది. ఎకరం పొలం కొన్నది.

ఆ మధ్య కుప్పుసామి ఒక కొత్తపాట మొదలెట్టేడు-"నా కోసం నువ్విలాగ పెళ్లీ పెటాకులు లేకుండా ఉండిపోయేవు, అలాక్కాదు ఒక మంచి రోజు చూసి నీ మెళ్లో పుస్తి కట్టేస్తాను" అని.

“పుస్తి కడితేనేనేటి,ఉప్పుడు మనం మొగుడూ పెళ్ళాలం కావా!” అనేది తను.

“ఆ సంగతి ఏరులే. నువ్వు ధైర్నంగా ఒక బిడ్డని కనొచ్చు. ఎప్పుడూ బతుక్కి తెగించి సముద్రం మీదకి పోయే నాకేదైనా అయితే అక్కడ మణియమ్మకు ఉన్నట్టే ఇక్కడ నీకు నీ బిడ్డ సాయం” అనేవాడు.

తన తమ్ముడికి పెళ్ళైందని తెలీగానే,“చూసేవా, నీ తమ్ముడు కూడా నీతో మాట మాత్రమైనా చెప్పకుండా పెళ్లి చేసేసుకున్నాడు. ఈ సారి నేను సముద్రంలోకెళ్లొచ్చేక మన పెళ్లి తప్పదు. తెల్సినోళ్లు నలుగుర్నీ పిల్చుకెళ్లి అన్నవరంలో చేసుకొచ్చేద్దాం” అన్నాడు.

అంతే! ఈ రెండేళ్లుగా కుప్పుసామిని మళ్లీ చూడలేదు.

ఆ ఎళ్లటం ఎళ్లటం ఒరిస్సాలో తుపానొచ్చింది.

మనిషి బతికున్నాడో లేదో తెలీక చాలా తల్లడిల్లిపోయింది తను. చివరికి జెట్టీలో ఎవరో చెప్పుకుంటుంటే తెల్సింది తుపానుసమయంలో కుప్పుసామి సముద్రంమీదుండి పోయేడంట. ఎలాగో ప్రేణాల్తో ఒడ్డుకి కొట్టుకొచ్చినా కదల సత్తువ లేనట్టై పోయేడంట. ఇంటికి కబురెళ్తే అతని కొడుకులొచ్చి తీసుకెళ్లిపోయేరంట. ఇంక కుప్పుసామి ఇటుకేసి రాడంట.

ఆ రోజు పనిలోంచి ఇంటికెళ్లేక చాలా సేపు ఏడిచింది.

అతని జ్ఞాపకంగా ఒక ఫోటో కూడా లేదు తన దగ్గిర. అతనికున్న మూడు జతల బట్టల్లో ఒక జత ఒంటిమీదుంటే రెండు జతల్ని వెంట తీసుకెళ్లటం అలవాటు. మెడ్రాసు దగ్గిర అనటమే కాని అతని ఊరేదో కూడా సరిగ్గా తెలీదు తనకి.

“కుప్పుసామి మనిషి చేలా మంచోడు.రెండు మూడు సార్లు కాకినాడ మెయిను రోడ్డులో తారసపడితే ఒటేలుకి తీసుకెళ్లి కాపీ టిపినూ ఇప్పించేడు” అన్నాడు భద్రం.

ఉలిక్కిపడి ఈలోకంలోకొచ్చింది దుర్గ.

ఊరి మొదట్లోనే భద్రం ఇల్లు.

వాకిట్లో చెట్టు కింద మంచం వేసుకుని ఎండపొడ తనమీద పడేలా పడుకునుంది భద్రం పెళ్ళాం.

మంచం పక్కన సైకిలు స్టేండేసి సంచులు కిందికి దించుతూ, "రాజులమ్మొలే, ఎవళొచ్చేరో పోల్చుకో సూద్దారి" అన్నాడు భద్రం.

"ఇదేటత్తా ఇలాగైపోయేవు" అని మంచం మీద పక్కన కూర్చుంది దుర్గ.

"నేనత్తా దుర్గని, గుర్తుపట్టలేదా?" అంది.

"మీ యత్తకి మున్నూటరవై రోజులూ ఒంట్లో బాగోటం లేదు. అదేం మాయా రోగవో పట్టుకుని వదల్టం లేదు. ఒక పిల్లా జెల్లా? ఈ ఏళకింటికొచ్చి నేనే ఏదో ఉడకేసి తనకింతపెట్టి నేనింత తింటం" అన్నాడు భద్రం లోపల్నుంచి గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి ఇస్తూ.

"ఇక్కడుంటే ఏం ఒదుల్తాదీ, కాకినాడ తీసుకు రాకూడదా, గవర్నమెంటు ఆసుపత్రిలో చూపిద్దారి" అంది దుర్గ.

"అయ్యన్నీ అయ్యేయి. డబ్బుల్లేందే గవుర్నమెంటోడుకూడా వైద్యం సెయ్యడని తెల్సుకుని, పడీ పాట్లేయో ఇంటికాడే పడదార్లే అని తీసుకొచ్చేసేను" అన్నాడు భద్రం బియ్యం కడిగిన నీళ్లు వాకిట్లో చెట్టు మొదట్లో పోస్తూ.

"మాయ్యా, చేటుంటే ఇలాగట్రా" అంది దుర్గ.

భద్రం తెచ్చిన చేటలో రెండు గుప్పిళ్ల ఎండు నెత్తళ్లు, రెండు గుప్పిళ్ల ఎండు రొయ్యలు, ఒక సందువా తట్టాం వేసి,"చాలా, ఇంకా ఎయ్యమంటావా?" అంది.

"సాల్లే తల్లీ, ఇయ్యే ఎక్కువ, నీపున్నెవాని రెండు నెల్లపాటు ఒండుకు తింటాం. సారన్నంలో ఉప్పుసేప నంజుకు తింటానని ఎప్పణ్నించో అడుగుతుంది మీయత్త. ఉప్పుడే కాల్చెడతాను" అన్నాడు భద్రం మొహం వెలిగిపోతూండగా.

ఇంటికొచ్చి దిగబెడతానన్నాడు కానీ ఒద్దని వారించింది దుర్గ.

ఊరికాచివర ఈంద్రపేటలో దుర్గ ఇల్లు. ఊరి మధ్య వీథి గుండా ఏ మాత్రం

మారని ఇళ్లని చూస్తూ, మనుషుల్ని పలకరిస్తూ నడుస్తోంది. సంచుల బరువుకి ఇటూ అటూ ఒరుగుతూ నడుస్తున్న దుర్గని చూస్తూ 'ఈంద్ర ఈరయ్య కూతురు' అని దుర్గకి వినపడేలా గుసగుసలాడుతున్నారు కొందరు.' ఏటి పిల్లా, అంత బలువు మోసుకొస్తన్నావ్' అని ఇచ్చకాలాడి పలకరిస్తున్నారు కొందరు.

నెలగంటరోజులు కావడం వలన పండగ పనుల్లో మునిగి పోయి ఉన్నారు ఆడవాళ్లంతా. కొందరు ఎర్ర మట్టితో గోడలు, అరుగులు మెత్తుతున్నారు. కొందరు వాకిళ్లలో బండెడు ఇత్తడి సామాను వేసుకుని చింతపండు, ఏటి ఇసక పెట్టి తళతళా మెరిసేలా తోముతున్నారు.

కొత్తగా చర్చి లోగిలి కట్టినట్టున్నారు, దక్షిణంవైపు పేటలోంచి మైకులో ఏసుక్రీస్తు పాటలు వినిపిస్తున్నాయి.

'కిస్‌మిస్ కదా' అనుకుంది దుర్గ తనలో.

ఇల్లు కట్టేక ఎప్పుడూ పగటి వేళ రాలేదు. రాత్రి వేళ వచ్చి పొద్దున్నే వెళ్లిపోవడమే. తల్లి పోయేక ఆ రావటమూ తగ్గిపోయింది. దూరంగా నిలబడి ఇంటికేసి గర్వంగా తృప్తిగా చూసుకుంది దుర్గ. చిన్నదైతేనేంగాక, అది తను కట్టించిన ఇల్లు.'వాకిట్లో నాలుగు బంతి మొక్కలైనా ఏసేరు కాదు' అని మనసులోనే విసుక్కుంది.

అరుగుమీద నవారు మంచం వేసుంది. గోడకి రెండు దిండ్లు చేరబెట్టి వాటికి వీపు ఆనించి పత్రికేదో తిరగేస్తున్నాడు వెంకటేశు.తెల్లని లుంగీ మీద పొడుగు చేతుల చొక్కా వేసుకుని రాజా బాబులా ఉన్నాడు. తను తమ్ముణ్ని చూసి రెండేళ్లు దాటిపోయింది. ఉద్యోగంలో చేరకముందంతా తరచుగా తనని చూడాలని వచ్చేవాడు. విశాఖపట్నంలో ఉద్యోగంలో చేరేక దూరం కావడం వలన కాబోలు అసలు ఇటు పక్కకే రాలేదు.

బక్కపల్చగా ఉండే వాడు కొద్దిగా ఒళ్లుచేసి రంగొచ్చేడు.

ఫేషను కాబోలు ఇదివరకుండే సన్నటి మీసం తీసేసాడు. పైకి దువ్విన జుట్టు, అదేదో సినిమాలో హీరోలాగా ఎంత అందంగా ఉన్నాడు తన తమ్ముడు! సడి

చెయ్యకుండా మెట్లెక్కి పుస్తకం లాక్కుని పక్కన పడేసింది.

"తమ్ముడూ ఎన్నాళ్ళైపోయిందిరా నిన్ను చూసి" అని ఓ అరుపు అరిచి తమ్ముడి కంఠాన్ని వాటేసుకుంది.

ఆ అలికిడికి లోపల్నుంచి వెంకటేశు పెళ్లాం శారద బయటికి వచ్చింది. ఆ అమ్మాయి తెల్లగా బొద్దుగా ఉంది.

మంచం పక్కనే ఉన్న సంచుల్లోంచి వస్తున్న ఎండు చేపల వాసన భరించలేక ముక్కును పైటచెంగుతో మూసుకుంది. తన భర్తనలా మరో స్త్రీ వాటేసుకోవటం, ఆ మోటుతనం చిత్రంగా అనిపించి రెప్పవాల్చకుండా చూస్తోంది.

గుమ్మంలో భార్యను చూసిన వెంకటేశు అక్క చేతుల్ని వదిలించుకుని ఇబ్బందిగా మొహం పెట్టి మంచంలో అనీజీ గా కదిలేడు. తమ్ముడి చూపుల వెంట తనూ వెనక్కి తిరిగి చూసింది దుర్గ. "ఈ పిల్లేనా నా మరదలు? లబ్బరు బొమ్మలా ఉంది. నా తమ్ముడి సెలక్సనా మరేటి? ఏవిరా బుజ్జులూ, అమ్మ లేపోతే పోయింది. నీ అక్క కూడా సచ్చి పోయిందనుకున్నావా ఒంటరిగా పెళ్లి చేసేస్కోటానికి! ఏంటమ్మాయ్, నువ్వైనా అడగలేదా నా యాడబిడ్డేదని?" అంది చొరవగా.

"పోన్లే పెళ్లికి రాపోతే ఏటైందిలే, ఉప్పుడొచ్చేనుగదా, ఇంక సూస్కో, ఆడబిడ్డ అర్ధమొగుడే మరి" అంది మురిపెంగా.

మరదలి మొహంలో మారుతున్న రంగుల్ని చూసి తన మాటల్లో ఏదో పొరపాటున్నట్టుందని ఆగిపోయింది. తమ్ముడి మొహంకేసి చూసింది. అతను గుడ్లప్పగించి పెళ్లాన్నే చూస్తున్నాడు.

తమ్ముడు తనతో ఎప్పట్లాగ గారాలు పోతూ మాట్లాడ్డం లేదని అర్థమైంది దుర్గకి. వాళ్లేదో బిడియపడుతున్నారనుకుని "తమ్ముడూ, నీకిష్టవని ఎండుసేపల్లో ఎన్ని రకాలున్నాయో అన్నీ తెచ్చేనొరే, ఉప్పుడు వంటైపోయిందా, వంజిరం ముక్కల కూరొండనా" అంది చీర కుచ్చిళ్లు బొడ్లో దోపుకుంటూ.

పక్కింటి పాపమ్మ వాకిట్లోకి బట్టలారెయ్యడానికి వచ్చినట్టుంది, గుమ్మంలోకి తొంగిచూసి "దురగా నువ్వంటే, ఇదేనా రాటం? ఆళ్ల బోయినాలైపోయేయిలే, ఇలారా మా యింట్లో వొణ్ణవుంది, తినెల్దువుగాని" అని పిల్చింది.

"నా కాకలి లేదులే అత్తా, ఇంత సందమావలాంటి మరదల్ని చూసి కడుపు నిండిపోయింది" అంది దుర్గ.

"సాల్లే బడాయి, రద్దూ" అని పిల్చుకెళ్లింది పాపమ్మ.

"నువ్వేటో ఎందుసేపలూ గట్టా అంటన్నట్టున్నావు. నీ మరదలు నీసు తినని పిల్లంట. ఈ నాలుగు రోజుల్నించీ సూస్తన్నాను గదా, రోజూ కాయగూరలూ, గడ్డీగసరా వొండుకుని తింటన్నారు" అంది.

ఆ అమ్మాయి చెంగుతో ముక్కెందుకు మూసుకుందో అప్పుడర్థమైంది దుర్గకి. "అదా సంగతీ" అని పడీ పడీ నవ్వింది.

"సంబడం బాగానే ఉంది కానీ ఇంక ఈ ఊరొచ్చే ఉద్దేశం లేదా నీకు?"

"అదేటి, కడుపట్టుకుని ఎక్కడెక్కడికో వలస ఎల్తాం. కాలూ సెయ్యీ వంగేక ఉన్న ఊరు రాక తప్పుద్దా? అందుకే కాదా నెత్తి మీదకింత నీడ ఏర్పర్సుకుంట".

"అదిగదే మరి, నీ తమ్ముడు ఇల్లూ, పొలవూ అమ్మకవెట్టేస్తన్నాడు తెల్సా నీకు? అందుకే సెలవు మీద వొచ్చేడంట, ఇంట్లో ఉంటన్న లచ్చుమ్మోళ్ళనీ కాళీ చేయించేసేడు. ఈ విసయం నీకు తెలుసో లేదోనని రామిగాడిసేత రమ్మని కవురెట్టేను."

దుర్గ నవ్వాగిపోయింది. నోట్లో పెట్టుకోబోతున్న అన్నం ముద్ద కంచంలో పడి పోయింది. "నువ్వా కవురెట్టింది!" అన్న మాట గొంతులోనే ఆగిపోయింది.

తమ్ముడే చూడాలని పిలిపించేడనుకుంది. అంతలోనే తేరుకుని, "పోన్లే అత్తా, నా తమ్ముడు సదువుకున్నాడు, ఎప్పుడేం సెయ్యాలో ఆడికి తెల్దేటి" అంది గ్లాసుడు నీళ్లు తాగి.

"అంత తెల్సినోడైతే అక్క పెళ్లి సెయ్యకుండా తను పెళ్లాడి పెళ్లాన్ని ఎంటెట్టుకొత్తాడేటి? అదీ రెండేళ్ల తర్వాత, ఇందాకట్నుంచి ఇంటన్నాను, తమ్ముడు

తమ్ముడని నువ్వు ఎంపర్లాడతన్నావే గాని ఆడినోటంట అక్కా అని ఒక్క ముక్కొచ్చిందా? ఇంకా ఏదో మాయదారి భ్రమలో వున్నావు, ఎల్లెల్లు నీకే తెలుత్తాది?"

"సాల్లే ఊరుకో, నాకీ వొయసులో పెళ్లేటి, ఎవరైనా ఇంటే నవ్విపోతారు. నా తమ్ముడెక్కడుంటే నేనూ అక్కడే, ఆడి పిల్లల్ని పెంచుకుంటా, పోసించుకుంటా ఉండిపోతాను" అంది దుర్గ సంబరాన్ని కొనితెచ్చుకుని,"సరే గాని పాపమ్మత్తా, ఆసేపల సంచి నువ్వు తెచ్చేసుకుందూ, ఆ వోసనికి మా మరదలు పిల్ల డోక్కుంటాదేమో కూడాను."

కంచం కడిగి బోర్లించి ఇంటికి తిరిగొచ్చింది. పాపమ్మ పట్టుకెళ్లిన సంచిగాక రెండో సంచి తనెక్కడ పెట్టిందో అక్కడే ఉంది.

దాన్లోంచి తను తమ్ముడి కోసం కొనుక్కొచ్చిన రెండు జతల బట్టలు, చెప్పులు, తీసి బైటపెట్టింది. మరదలి కోసం కొనుక్కొచ్చిన చీరలు, జాకెట్లు, స్టీలు గిన్నెలు, స్వీట్లు, పళ్లుపూలు అన్నీ మంచం మీద పేర్చి, అరుగు చివరి కొచ్చి ఖాళీ సంచిని దులిపేసింది, "తీసుకోండి, ఇయ్యన్నీ మీకే" అంది. బొడ్లో దోపుకున్న ఎర్రకాయితప్పొట్లాం విప్పి తళతళా మెరుస్తున్న తెల్లరాయి ఉంగరం తీసి తమ్ముడి వేలికి తొడిగింది.

అప్పటికి నోరు విప్పి, "ఇప్పుడెందుకివన్నీ" అన్నాడు వేంకటేశు.

తను లేని సమయంలో ఏం మాట్లాడుకున్నారో ఇద్దరూ మొహాలు గంట్లు పెట్టుకుని ఉన్నారు. దుర్గ చొరవగా లోపలికెళ్లలేకపోయింది. అక్కడే గోడకి చేరబడి కూర్చుండిపోయింది.

వెంకటేశు గోడ వైపు చూస్తూ, "ఇక్కడి వ్యవహారమంతా ముగిసేక నీకు తెలియజేద్దామనుకున్నాను. అంతలోకి నువ్వే వచ్చేవు. శారదా, నేను అమెరికా వెళ్లే ప్రయత్నంలో వున్నాం. అక్కడ వాళ్ల బాబాయి ఉన్నారు. ఆయనే మాకిద్దరికీ అక్కడ ఉద్యోగాలు చూసారు. కొంత ఖర్చు వాళ్ళ నాన్నగారు పెట్టుకుంటున్నారు. అది చాలక ఈ ఇల్లు, పొలం అమ్మాలనుకుంటున్నాను" అన్నాడు.

దుర్గకి ఎవరో నెత్తి మీద సమ్మెటతో మోదినట్లైంది. ఆకాశానికీ భూమికీ మధ్య ఒంటరిగా గిరగిరా తిరిగినట్లైంది.

తనను తను తమాయించుకునేసరికి కళ్ళ నిండా నీళ్ళు నిండుకొచ్చేయి. "అమెరీకానా.... అంత దూరవా...." అంది ఎలాగో మాట మీద మాట పేర్చి.

"అవును, ఇద్దరం కంప్యూటర్ ఇంజనీర్లమే కదా! ఇక్కడుంటే ఏం సంపాదించగలం, బూడిద" అన్నాడు.

"మరి......మరి......నేను..నేను" అంది దుర్గ. ఆ పైన మాట పెగలలేదు.

"నీకు కుప్పుసామి ఉన్నాడు కదా" అన్నాడు వెంకటేశు. ఆ గొంతులో ధ్వనించిన వ్యంగ్యం, ఎగతాళి దుర్గకి శరఘాతాల్లా తగిలాయి.

"అయినా నువ్విప్పుడెందుకొచ్చేవో నాకు తెలీదనుకోకు. ఈ అమ్మకం జరక్కుండా ఆపాలనేగా, ఆ పని నీ వల్ల కాదు. ఎందుకంటే అమ్మ ముందుచూపుతో ఇల్లు, పొలం నా పేరునే పెట్టింది గనక".

వెల వెల పోయింది దుర్గ. తన ప్రమేయం లేకుండానే చటుక్కున లేచి నిలబడింది.

మెట్ల వేపు అడుగెయ్యబోతుంటే-"ఆగండి, మొదటిసారి మా ఇంటికొచ్చేరు, ఉత్త చేతుల్తో వెళ్లకూడదు" అంటూ తలుపు వెనక నుంచి మరదలు బైటికొచ్చింది. కుంకం భరిణ తెరిచి దుర్గ మొహాన బొట్టు పెట్టి, మంచం మీదున్న జాకెట్టు ముక్కల్లోంచి ఓ ముక్క తీసి చేతిలో పెట్టింది.

వెర్రిదానిలా దుర్గ జాకెట్టు ముక్కనీ, శారదనీ మార్చి మార్చి చూసింది. పొలం మీది మకరా ధాన్యం ధీమాతో ఇవన్నీ కొనడానికి తను అనపర్తి రెడ్ల దగ్గిర చేసిన చక్రవడ్డీ అప్పు కళ్ళ ముందు పెనుభూతంలా కదలాడుతూండగా నడిచిందో పరుగెత్తిందో తెలీని స్థితిలో పుంత దారిన పడి రోడ్డు చేరుకుంది. కదలడానికి సిద్ధంగా వున్న బస్సెక్కబోతుండగా వెనక నించి సైకిలు బెల్లు మోగించుకుంటూ,

"దురగా...దురగా" అని అరుచుకుంటూ వచ్చి,"సంచులు మరిసిపోయేవంట" అని ఖాళీ సంచుల్ని చేతికందించేదు భద్రం.

*********

రచన (ఫిబ్రవరి 2002)